క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని విజయపూరి కాలనీ సమీపంలోని కొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్ద సోమవారం స్థానిక ఎస్సై రామారావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రానికి చర్ల మండలం నుంచి వాజేడు మండలాల నుంచి వచ్చివెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. తనిఖీల్లో ఆలుబాక సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మంగపేట: మండలంలోని మల్లూరు బీసీ కాలనీ సాయిబాబా టెంపుల్ వద్ద లేగ దూడలను ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం అమరవరం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై మంగపేట వైపు నుంచి వస్తున్నారు. మార్గమధ్యలో మల్లూరు వద్ద సాయిబాబా టెంపుల్ వద్ద చీకటిలో మూడు లేగదూడలు అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో బైక్ వాటిని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు కాగా లేగదూడ అక్కడికక్కడే మృతి చెందింది. అదే సమయంలో పెట్రోలింగ్ చేస్తూ అక్కడకు చేరుకున్న ఎస్సై రవికుమార్ గాయపడిన యువకులను వెంటనే ఆటోలో ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పశువులను రోడ్లపైకి రానివ్వొద్దు

మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లి నుంచి కమలాపురం వరకు గల గ్రామాల ప్రజలు వారి పశువులను ఏటూరునాగారం-బూర్గంపాడు ప్రధాన రోడ్డుపైకి రానివొద్దని ఎస్సై జి.రవికుమార్ అన్నారు. బ్రాహ్మణపల్లి నుంచి కమలాపురం వరకు సుమారు 24 కిలోమీటర్ల మేర ప్రధానరోడ్డుకు ఇరువైపుల ఉన్న రాజుపేట, రమణక్కపేట, వాడగూడెం, చుంచుపల్లి, కొత్తమల్లూరు, మల్లూరు, బోరునర్సాపురం మంగపేట, కమలాపురం గ్రామాల మధ్య నుంచి ప్రధాన రోడ్డు ద్వారా మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు వాహనాల రద్దీతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ముందస్తు జాగ్రతగా రైతులు, పశుపోషకులు వారి పశువులను వదిలేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అదే విధంగా రోడ్డుపైకి చిన్నపిల్లలను రానివ్వకుండా చూసుకోవాలన్నారు. రోడ్డు దాటే క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రధానంగా చిన్న పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దని ప్రమాదాలకు కారకులు కావొద్దని సూచించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

భూపాలపల్లి రూరల్: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని పెద్దాపూర్‌లో చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన మాడుగుల ప్రదీప్ (35) పదిరోజుల క్రితం మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు, బంధువులు హనుమకొండలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అప్పుల బాధ భరించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు.

లింగాలలో మహిళ..

రేగొండ: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని లింగాలలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మొగుళ్లపల్లి మండలం వేములపల్లికి చెందిన హిమబిందు(25)కి ఎనిమిది నెలల క్రితం మండలంలోని లింగాలకు చెందిన మొర్రి హరీష్‌తో వాహం జరిగింది. ఈ క్రమంలో హిమబిందు గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. నొప్పి భరించలేక జనవరి 30న పురుగుల మందు తాగి ఆత్యహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి సుక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాలి

మహాముత్తారం: కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా విద్యావేత్త గోమాస సచిన్‌ను ప్రకటించాలని నేతకాని రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి తాటిపల్లి రాజబాపు నేత అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సచిన్ కరోనా సమయంలో పెద్దపల్లి పార్లమెంట్ పరిధితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత సేవచేసి యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు.

నిజాయితీకి మారుపేరు మంత్రి సీతక్క

- కావాలనే మంత్రిపై అసత్యప్రచారం
- ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్



ములుగు రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న పైడాకుల అశోక్

ములుగు రూరల్: నిజాయితీకి మారుపేరు, అవినీతి మచ్చలేని ఏకైక నాయకురాలు మంత్రి సీతక్క అని ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ. చాంద్‌పాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశానికి అశోక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సీతక్క మంత్రి కావడం కొందరు ఓర్చుకోలేని వారు అక్రమ ఇసుక రవాణా చేస్తుందని అసత్య ప్రచారాలు చేస్తూ శునకానందం పొందుతున్నారని అన్నారు. ప్రజాసేవయే పరమావధిగా జీవిస్తున్న మంత్రి సీతక్కపై కొందరు ప్రతిపక్ష నాయకులు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. సీతక్కపై అసత్య ఆరోపణలు చేస్తే ఉపేక్షించేది లేదని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇప్పటికైనా సీతక్కపై చేసిన ఆరోపణలు తప్పని వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవి యాదవ్, జిల్లా నాయకులు ప్రవీణ్, భిక్షపతి, అనిల్, లక్కీ, రణదీప్ పాల్గొన్నారు.

సీతక్కను విమర్శించే స్థాయి ఎవరికీ లేదు



గోవిందరావుపేట: మాట్లాడుతున్న కల్యాణి

గోవిందరావుపేట: మంత్రి సీతక్కని విమర్శించే స్థాయి, అర్హత ఎవరికి లేదని ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేగ కల్యాణి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు మద్దాలి నాగమణి ఆధ్వర్యంలో సోమవారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షురాలు కల్యాణి హాజరై మాట్లాడుతూ సీతక్క పై అసత్య ప్రచారాలు చేస్తున్న వారందరూ దమ్ముంటే ఆధారాలు చూపించాలని అన్నారు. ప్రజల కోసం, ప్రజాసేవ కోసం పరితపించే నాయకురాలు సీతక్క అన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలు సీతక్కపై అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రజాసేవ తప్ప మరొకటి తెలియని నిస్వార్థ నాయకురాలు సీతక్క అని అన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెబోయిన సృజన, మండల మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు చొప్పదండి వసంత, పులుసం లక్ష్మీ, భవాని తదితర నాయకురాలు పాల్గొన్నారు.

మేడారం బస్టాప్ ప్రారంభం



బస్టాప్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్ వీరస్వామి

మంగపేట: మండల కేంద్రం నుంచి మేడారం జాతరకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు భద్రాద్రికొత్తగూడెం జిల్లా మణుగూరు ఆర్టీసీ వారు రైతువేదిక వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాప్‌ను తహసీల్దార్ వీరస్వామి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాప్ నుంచి మండలంలోని వివిధ గ్రామాల నుంచి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులను సురక్షితంగా తీసుకెళ్లి ఇంటికి చేర్చేందుకు 10 బస్సులను కేటాయించినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. పెద్దవారికి చార్జీ రూ.110, చిన్నవారికి రూ.70 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు వారి ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ ఏసుపాదం, మణుగూరు డిపో ఆర్టీసీ డీఎం స్వామి, మోహన్ రావు, బస్టాప్ ఇన్‌చార్జ్‌లు పీఎస్.రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి ఉత్సవాలు



మల్లంపల్లిలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆరె కుల సంఘం నేతలు



ఏటూరునాగారం: శివాజీ ఫొటోకు పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ చిన్న

ములుగు రూరల్: మండలంలోని మల్లంపల్లి గ్రామంలో శివాజీ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా ఆరె కుల సంఘం అధ్యక్షుడు లాడ శ్యామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మల్లంపల్లి ఆరె కుల బంధువులు అంగిరి రవి, ఉషనపల్లి గోపి, షాపూర్ కమలాకర్, లక్ష్మణ్, మహేందర్‌రెడ్డి, రమేష్, రాజు, కరణాకర్, సంజీవ్, శ్రీకాంత్, నిరంజన్, సంబారావు పాల్గొన్నారు.

ఏటూరునాగారం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్న శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.మధ్యయుగ భారతదేశ చరిత్రలో శివాజీ గొప్పయోధుడుగా హైందవ సమాజ నిర్మాతగా, మరాఠా జాతిపితగా, హిందూ స్వరాజస్థాపన కోసం తను ఎంతో కృషి చేశాడన్నారు. చరిత్ర విభాగం అధిపతి సిహెచ్. వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, విజయలక్ష్మీ, రమేష్, రేణుక, రమేష్, నవీన్‌ఫాతిమా, సంపత్ పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



కాటారం: బహుమతులు ఇస్తున్న ఉపాధ్యాయులు

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 8వ తరగతి విభాగంలో చింతకాని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన శివమణి, 9వ తరగతి విభాగంలో మాంటిస్సోరి పాఠశాలకు చెందిన కె.శివాని ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయికి ఎంపికైౖ విద్యార్థులను కాటారం జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గండు రాజబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, శ్రీనివాస్, సుధాకర్, కుమారస్వామి, నళిని, రమణారెడ్డి, కోమల్, హరీష్ పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని జూకల్ ఉన్నత పాఠశాలకు చెందిన జంబుల సౌమిత్ (8వ తరగతి) విద్యార్థి మండల స్థాయిసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమస్థానంలో నిలిచినట్లు సోమవారం ప్రధానోపాధ్యాయుడు జి.కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు రాధిక రాణి, ఉమాదేవి, మమత, రంజిత్ కుమార్, స్వరూప, రూపశ్రీ, ఎండీ.రఫీ, మాధవి, చారి, సాంబరాజు అభినందించారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో సైన్స్, బొమ్మపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు నోడల్ అధికారి శంకరయ్య సోమవారం తెలిపారు. సైన్స్ పోటీల్లో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి రామ్‌చరణ్ మొదటి బహుమతి, రెండో బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సూరారం విద్యార్థి అభినేష్, విష్ణు సంయుక్తంగా విజయం సాధించారు. క్విజ్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహదేవపూర్ విద్యార్థులు ప్రథమ స్థానం, అంబట్‌పల్లి విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు.

భక్తులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న మధువంశీకృష్ణ

చిట్యాల: మేడారం జారతకు వెళ్లే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఎన్నడూ లేనంతగా సదుపాయాలను కల్పించిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధు వంశీకృష్ణ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వనదేవతలను దర్శించుకోవడానికి లక్షల మంది భక్తులు వస్తారని అందుకు రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం కంటే రూ.కోట్లాది నిధులను మంజూరు చేసి అన్ని సదుపాయాలను కల్పించడం జరిగిందని అన్నారు. అలాగే చిట్యాల మండలంలోని వెంచరామి శివారులోని పురేడు గుట్ట వద్ద, మొగుళ్లపల్లిలోని చలివాగు వద్ద, రేగొండ మండలంలోని తిర్మలగిరి శివారులో, గుర్రంపేట శివారులో శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ జాతరలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కృషితో అనేక నిధులు కేటాయించి జాతరల అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ రాజ్ మహ్మద్, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మన్ గౌడ్, రాయకొమురు, బుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

కాటారం: మండలంలోని విలాసాగర్‌లో ఇటీవల రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన 393 క్యూబిక్ మీటర్ల ఇసుకను తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. శ్రీనివాస్ ఇసుక వేలం దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. క్యూబిక్ మీటర్‌కు రూ.600 చొప్పున మొత్తం రూ.2,35,800 ఇసుక వేలం ద్వారా వచ్చినట్లు పేర్కొన్నారు. మొత్తం నగదును మైనింగ్ శాఖ ద్వారా ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్లు తహసీల్దార్ వివరించారు.

పాత పద్ధతిలోనే జాతర కమిటీ నిర్వహణ

మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి-ముల్కలపల్లి గ్రామాల మధ్య జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవ కమిటీలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పందించారు. పాత పద్ధతిలోనే కమిటీ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో ముల్కలపల్లికి చెందిన చదువు అన్నారెడ్డిని చైర్మన్‌గా జాతర కమిటీ డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అన్నారెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా జాతరను సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

'తప్పుడు ప్రకటనలు మానుకోవాలి'

చిట్యాల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగుడ్లను కిరాణ షాపుల్లో అమ్ముతున్నారని ఏబీవీపీ నాయకుడు రాజ్‌కుమార్ ఇచ్చిన తప్పుడు ప్రకటనల్లో ఎలాంటి వాస్తవం లేదని అలాంటి ప్రకటనలను మానుకోవాలని అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతల సంధ్యారాణి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఎలాంటి ఆధారాలు లేకుండా కావాలని తమపై అవమాన పరిచే విధంగా ప్రకటనలు ఇవ్వడం సరికాదన్నారు. విచారణకు వచ్చిన అధికారులకు రాజ్‌కుమార్ ఎలాంటి ఆధారాలు చూపలేదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కరుణ, ఉమ, భాగ్యలక్ష్మీ, జ్యోతి, భాగమ్మ, సుజాత, రాజేశ్వరీ, వెంకటరమణ, అరుణ, శారద, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వైద్యశిబిరాలు

మహాముత్తారం: మేడారం మహాజాతరను పురస్కరించుకొని మండలంలో మూడు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి సందీప్ తెలిపారు. యామన్‌పల్లి, పెగడపల్లి, సింగారం గ్రామాల్లో ఈ శిబిరాలు ఈ నెల 21 నుంచి 24 వరకు ఉంటాయని తెలిపారు.

పోలీస్ బందోబస్తు ఏర్పాటు

మహాముత్తారం: మేడారం మహాజాతరను పురస్కరించుకొని భక్తుల సౌకర్యం కోసం కాటారం సబ్ డివిజన్‌లోని కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్, మండలాలతోపాటు ప్రధానంగా మండలంలోని కొర్లకుంట, యామన్‌పల్లి, నిమ్మగూడెం,పెగడపల్లి, బోర్లగూడెం, రేగులగూడెం, సింగారం నుండి కాల్వపల్లి వరకు వెళ్లే ప్రధాన రహదారుల వద్ద జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఆరుగురు డీఎస్పీలు, 10 మంది సీఐలు 20 మంది ఎస్సైలతో పాటు 500 మంది సిబ్బందిని బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కాటారం డీఎస్పీ రాంమోహన్ రెడ్డి తెలిపారు. వీరు మంగళవారం నుంచి జాతర ముగిసే వరకు విధుల్లో ఉంటారని తెలి పారు. వీరు వివిధ మండలాల్లోని మేడారం వెళ్లే ప్రధాన రహదారులతో పాటు జంక్షన్ల వద్ద, మూలమలుపులు, కల్వర్టులు, పార్కింగ్‌ల వద్ద విధులు నిర్వహిస్తారని తెలిపారు.

ఎస్సైకి సన్మానం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై పీవీఎస్.భవానిసేన్‌ను కాంగ్రెస్ నాయకులు, కిరాణ వర్తక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సోమవారం శాలువాతో సన్మానించారు. సన్మానించిన వారిలో మాజీ ఎంపీపీ సత్తమ్మ, డీసీసీ ప్రధానకార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా మైనార్టీ నాయకులు జానీ, మాజీ వార్డు సభ్యురాలు కవిత, సారయ్య, నాయకులు షకీల్, రాజబాపు, హైదర్, బాబా, సంతోష్, రాజశేఖర్, కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు గందెసిరి మధుసూదన్, కోశాధికారి రేణికుంట్ల శ్రీనివాస్, వి. వెంకట్ రెడ్డి, కిరణ్, మహేష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఇమ్రాన్, తదితరులు ఉన్నారు.

అమ్మవార్ల దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

- భక్తుల సేవలకు 140 మంది ఆలయ సిబ్బంది
- 1.50 కోట్ల మంది రానున్నట్లు అంచనా
- ఆలయ ఈఓ రాజేంద్రం



రాజేంద్రం, ఆలయ ఈఓ

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క-సారలమ్మను ప్రశాంత వాతావరణంలో దర్శించుకునేలా దేవాదాయశాఖ తరఫున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ రాజేంద్రం తెలిపారు. సోమవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఈసారి జాతరకు 1.50 కోట్ల మంది భక్తులు రానున్నట్లు అంచనా వేశాం. జాతర నా లుగు రోజులు అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తుల కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా క్యూలైన్లపై చలువ పందిళ్లు, తాగునీటి కోసం నల్లాలు ఏర్పాటు చేశాం. వీఐపీలు, వీవీఐపీలకు ఆలయ సంప్రదాయంగా స్వాగతం పలుకుతాం. పోలీసులు, జిల్లా అధికారుల సమన్వయంతో జాతర విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాం.

క్యూలైన్ల ద్వారానే ప్రశాంతమైన దర్శనం

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో క్యూలైన్ల ద్వారానే అమ్మవార్లను ప్రశాంతమైన దర్శనం చేసుకోవచ్చు. టీటీడీ కల్యాణమండపం, ఆర్చి ప్రధాన ద్వారం పక్కన, ఆలయం వెనుకాల ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా భక్తులు వచ్చి ఓపికతో అమ్మవార్లను దర్శించుకోవాలి. క్యూలైన్లలో వచ్చిన భక్తులకు గంటల వ్యవధిలోనే అమ్మవార్ల దర్శన భాగ్యం కలుగుతుంది. ఇలా కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వచ్చి ఇబ్బందులకు గురికావొద్దు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన మీడియా పాయింట్ మంచెపైన మైక్ అనౌన్స్‌మెంట్ సిబ్బందిని సంప్రదిస్తే తగు చర్యలు తీసుకుంటాం. ఈ జాతర నాకు నాల్గోవది. ఈ మహాజాతరలో కూడా మంత్రులు సీతక్క, కొండా సురేఖ, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, పూజారులు, అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ, ఎక్కడ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు దెబ్బతినకుండా విజయవంతానికి సమష్టిగా కృషి చేస్తాం.

బస్సుల కొరత లేకుండా చూడాలి



హనుమకొండ బస్టాండ్‌లో ములుగు బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

- బీఎస్పీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య జంపన్న

ములుగు : ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు ములుగు వైపునకు బస్సుల కొరత లేకుండా చూడాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య జంపన్న డిమాండ్ చేశారు. హనుమకొండ బస్టాండ్ నుంచి అన్ని బస్సులు మేడారం వైపే వెళ్తుండటంతో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీఎస్పీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య జంపన్న అన్నారు. హనుమకొండ నుంచి ములుగుకు వెళ్లేందుకు ఇక్కడి బస్టాండ్‌లో గంటల కొద్ది ఎదురుచూపు చూడాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. మేడారం మహాజాతరకు నేటి ప్రభుత్వం బస్సులు ఏర్పాటు చేసి అధిక చార్జీలతో దోపిడీ చేస్తున్నారని అందువల్లనే బస్సులు అన్ని కూడా మేడారం వైపు పోతున్నాయన్నారు. అత్యవసరంపై హనుమకొండ నుంచి ములుగు, ఏటూరునాగారం, మంగపేట, భద్రాచలం వెళ్లాలంటే సమయానికి బస్సులు లేకపోవడంతో గంటల కొద్ది నిరీక్షిస్తున్నారన్నారు. రాత్రి 9 గంటల తర్వాత ములుగుకు బస్సులు దొరకడం ఎడారిలో నీరు దొరకని విధంగా కష్టంగా ఉండటం బాధాకరమన్నారు.

రేగు చెట్టుకు తాటికల్లు



కాటారం: ఈత, తాటి చెట్లకు కల్లు పారడం సహజం.. కానీ రేగు చెట్టుకు తెల్లకల్లు పారుతున్న వింత సంఘటన కాటారం మండల కేంద్రం గారెపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గారెపల్లి హమాలీవాడకు చెందిన మహమ్మద్ సలీం ఇంటి ఆవరణలో మూడేళ్ల క్రితం రేగు మొక్కను నాటాడు. ఇప్పుడు అది ఎదిగి ఐదు రోజులుగా కల్లు కిందకు పారుతోంది. గమనించిన సలీం చెట్టుకు ఓ బాటిల్‌ను అమర్చగా కల్లు ఉబికి వస్తుండటంతో స్థానికులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. రేగు చెట్టు నుంచి వస్తున్న కల్లు అచ్చం తాటి కల్లులా ఉందని తాగిన వారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సంజీవ్‌రావును సాక్షి అడగగా ప్రతి చెట్టులో కణద్రవం ఇమిడి ఉంటుందని తెలిపారు. చెట్టుకు గీత పెట్టినప్పుడు కణద్రవం బయటకు వస్తుందని చెట్టు జాతిని అనుసరించి ఒక్కో రంగులో ఇలా ద్రవం బయటకు రావడం జరుగుతోందని తెలిపారు. కానీ రేగు చెట్టు నుంచి వచ్చే ద్రవపదార్థం తాటి కల్లు రుచి ఉండదని వివరించారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న పోలీసులు

పలిమెల: అటవీ జంతువుల వేటకు విద్యుత్ తీగలను అమర్చిన మండలంలోని పలు గ్రామాలకు చెందిన తొమ్మిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని సోమవారం తహసీల్దార్ హేమ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు. అటవీ జంతువులను వేటాడడానికి, పంట పొలాల రక్షణ కోసం విద్యుత్ తీగలను అమర్చొద్దని హెచ్చరించారు. ఎవరైనా ఈ విధంగా చేస్తే వారి పై చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి ప్రమాదం జరిగిన ఆ ప్రమాదానికి కారణమైన వారిపై రౌడీషీట్‌తో పాటు, హత్యా నేరం కూడా నమోదు చేస్తామన్నారు.

ఇద్దరు బైండోవర్

మండల కేంద్రానికి చెందిన కుమ్మరి సారయ్య, పెగడపల్లికి చెందిన కొర్ర వీరపాల్‌లను రూ.లక్ష పూచీకత్తుపై తహసీల్దార్ హేమ ముందు సోమవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై తమాషారెడ్డి తెలిపారు. ఇటీవల పక్కా సమాచారం మేరకు సారయ్య ఇంటి వద్ద సోదా చేయగా ఆయనను, ఇతనికి గుడుంబా సరఫరా చేస్తున్న పెగడపల్లికి చెందిన వీర్ పాల్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా నిషేధిత గుడుంబాను అమ్మినా, సరఫరా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.